సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 5 । మే । 2024



మీకు తోడుంటా

గంగవరం మండలం దోరమామిడిలో రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓ ఇంటి వద్ద పిండి వంటలు చేస్తున్న మహిళలకు సాయ పడుతూ ఆకట్టుకున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల వేళ మరింత అప్రమత్తం



ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు గురుచరణ్ సింగ్

చింతపల్లి రూరల్: ఎన్నికల వేళ బూత్ లెవెల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని అరకు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు గురుచరణ్ సింగ్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని లంబసింగిలో పర్యటించారు. బూత్ లెవెల్, సెక్టోరల్ అధికారుల విధుల నిర్వహణను ఆయన పరిశీలించారు. వారితో కొంతసేపు మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ రామకృష్ణ నుంచి తెలుసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు ఆయన సూచనలిచ్చారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



గుర్తేడు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మారేడుమిల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో గుర్తేడు ఎస్ఐ సాయికుమార్ సిబ్బందితో శనివారం గుర్తేడు, పాతకోట గ్రామాల పరిసరాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం పులుసుమామిడి గ్రామాన్ని సందర్శించారు. అక్కడ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత అభ్యున్నతికి పోలీసుశాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చూడాలని, అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

పోలీసు బలగాల కవాతు



చింతపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

చింతపల్లి రూరల్: ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలో పోలింగ్ నేపథ్యంలో భద్రత మరింత పెంచామని ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



పీవీ నాగేశ్వరరావు (ఫైల్)

చింతూరు: స్థానిక పోలీసు స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ పీవీ నాగేశ్వరరావు శనివారం ఉదయం గుండె పోటుతో మృతిచెందారు. ఏడుగురాళ్లపల్లి పోలీసు అవుట్ పోస్టులో విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను ఎస్ఐ శ్రీనివాసరావు వెంటనే రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు మర్రి కామయ్య వర్ధంతి

హుకుంపేట: స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతి మండలంలోని కామయ్యపేటలో ఆదివారం ఆయన సమాధి వద్ద నిర్వహిస్తున్నట్లు మర్రి కామయ్య ఆశయసాధన సమితి, నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లోరి కేశ్వరరావు, సీదరి కొండబాబు, పాంగి రామారావు, కొర్ర కృష్ణామూర్తి తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటుచేసినట్టు వారు పేర్కొన్నారు.

నీ నిర్వాకమే బాబూ..

చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల వృద్ధులు, వితంతువులు పింఛను పొందేందుకు ఎదురైన కష్టాలు శనివారం కూడా కొనసాగాయి. ఇదివరకు ఒకటో తేదీ వస్తే పండుగ వచ్చినట్టుండేదని, వలంటీర్లను దూరం చేయడం వల్ల మండే ఎండలో తిరగలేక ప్రాణం పోయేలా ఉందని వారు వాపోతున్నారు. ఇంతగా తమపై కక్షగట్టడం బాబు అండ్‌కోకు ధర్మం కాదని.. తమ ఉసురు తప్పక తగులుతుందని వారు విలపించారు.

– సాక్షి, నెట్‌వర్క్

- పింఛన్ల కోసం వృద్ధులు, వితంతవులకు నానాఅవస్థలు
- బ్యాంకుల వద్ద తప్పని పడిగాపులు



పెదబయలు గ్రామీణ బ్యాంకు ఎదుట పింఛను నగదు కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

వృద్ధాప్యంలో ఇంత కష్టమా..



మా వయసుపై చంద్రబాబుకు కనీస గౌరవం లేదు. గతంలో వలంటీర్ మా ఇంటి తలుపు తట్టి తెల్లారగానే పింఛను అందించే వారు. చంద్రబాబు చేసిన దుర్మార్గపు పనికి మండుటెండలో ఇబ్బందులు పడుతున్నాం. గడప దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉన్నా అవస్థలు పడుతూ మారుమూల ప్రాంతం నుంచి బ్యాంకుకు వచ్చాం.

– జన్ని చిట్టమ్మ, వృద్ధురాలు, బందమామిడి, హుకుంపేట మండలం

ఇలాంటి ఇబ్బందులు ఎన్నడూలేవు



నాలుగేళ్లలో ఇల్లు కదలకుండా ప్రతినెలా ఒకటో తేదిన ఠంచన్‌గా పింఛను అందేది. చంద్రబాబు నిర్వాకం వల్ల ఈ వయసులో గడపదాటి రావాల్సి వచ్చింది. బ్యాంక్‌లో పింఛను తీసుకునేందుకు 25 కిలోమీట్ల నుంచి వచ్చాను. మా ఊరి నుంచి ఆటోలో కొత్తపల్లి చేరుకొని అక్కడ నుంచి బస్సులో గంగవరంలోని బ్యాంక్‌కు వచ్చాను.

– చోడి కృష్ణవేణి, ఓజు బంద, గంగవరం మండలం

పింఛనుకోసం ఎన్నో అవస్థలు



పింఛన్ కోసం 25 కిలోమీటర్లు దూరంలో ఉన్న గోమంగి పంచాయతీ నుంచి బ్యాంకుకు పెదబయలు వచ్చా. గతంలో వలంటీర్ ఒకటో తేదీన ఇంటికి వచ్చి ఇచ్చే వారు. చంద్రబాబు అడ్డుపడి వలంటీర్లను రాకుండా చేశారు. ఎన్ని కష్టాలు పెట్టిన సీఎం జగన్‌కే ఓటు వేస్తాం. మళ్లీ వలంటీర్లు వచ్చేలా జగన్‌బాబు ఏర్పాట్లు చేస్తారు.

– లోచలి అప్పారావు, కుమ్మరివీధి, గోమంగి పంచాయతీ, పెదబయలు మండలం

మండుటెండలో ఇబ్బందులు



జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఎంతో సుఖంగా వలంటీర్ ద్వారా ఇంటివద్దే పింఛను అందుకునేవాళ్లం. ఎన్నికల పుణ్యమాని ప్రతిపక్షాల కుట్రతో మాలాంటి ముసలోళ్లను మండుటెండలో ఇబ్బందులు పడేలా చేస్తున్నారు. పింఛను డబ్బు కోసం మినీ ఏటీఎంలకు వెళ్లి వారికి కమిషన్ ఇచ్చి పింఛను తీసుకున్నాం.

– మంతెన వెంకటాచారి, గొరిదేవిపేట, ఎటపాక మండలం

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం



ప్రతినెలా వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛను అందించే సౌకర్యాన్ని చంద్రబాబు దూరం చేశారు. ఆయన చేసిన కుట్ర వల్ల బ్యాంకుల చుట్టూ మూడు రోజులుగా మండుటెండలో తిరుగుతున్నాం. మాది పెదబయలు మండలం మారుమూల గోమంగి. నా బ్యాంక్ ఖాతా ముంచంగిపుట్టులో ఉన్నందున ఎన్నో ఇబ్బందులు పడి వచ్చా. బాబు నిర్వాకం నాలాగే ఎంతో మంది ఇబ్బందులు పడ్డారు.

– కె.బలమ్మ, కోరుకొండ, గోమంగి పంచాయితీ, పెదబయలు మండలం

వివరాలు తెలియక ఇబ్బందులు



పింఛను కోసం ఏ బ్యాంకుకు వెళ్లాలో తెలియక చాలా అవస్థలు పడుతున్నా. మా గ్రామం నుంచి 28 కిలోమీటర్ల దూరం నుంచి ముంచంగిపుట్టు వచ్చాను. మూడు రోజులైనా తగిన సమాచారం, వివరాలు లేక పింఛను పొందలేకపోయా. పార్టీ ఏదైనా పింఛనుదారులను ఇబ్బందులు పెట్టకూడదు. రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు లాంటి వ్యక్తి ఇలా చేయడం తగదు.

– జి.నొయిన, కొసంపుట్టు, బుంగాపుట్టు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

సమర్థంగా పోలింగ్ విధులు : కలెక్టర్ విజయ సునీత



ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ విధులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. స్థానిక గురుకుల కళాశాలలో రంపచోడవరం, పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని పీవోలు, ఏపీవోలకు ఈవీఎంల వినియోగంపై రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకుడు కె.వివేకానందన్ సూచనలిచ్చారు. అరకు, పాడేరు ఆర్వోలు వి.అభిషేక్, భావన వశిష్ట ఎన్నికల పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు.

రంపచోడవరం: పోలింగ్ ప్రక్రియపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో ప్రశాంత్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు.

ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా

- ఆ పార్టీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



దారపల్లిలో ప్రచారం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో శనివారం ముంచంగిపుట్టులో వారపు సంతతో పాటు ధారపల్లి, ఇందిరా కాలనీలో ఆయన ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చూపిన పారదర్శకత, పాలనాదక్షతలను చూసి గ్రామాల్లో ఎక్కడకు వెళ్లినా మా నమ్మకం నువ్వే జగన్ అంటూ గిరిజనులు అభిమానాన్ని చాటుకుంటున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అరకు అసెంబ్లీ అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థిగా గుమ్మ తనూజారాణిని గెలిపించాలని కోరారు.

హోం ఓటింగ్ @110

- జిల్లావ్యాప్తంగా వయో వృద్ధులు 2,723, దివ్యాంగులు 1,895 మంది గుర్తింపు
- ఇళ్ల వద్దకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- పోలీసు బందోబస్తు మధ్య ఓటింగ్



వన్నాడలో హోం ఓటింగ్ నిర్వహిస్తున్న మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి విగ్గిన్స్, సిబ్బంది



లబ్బర్తిలో ఓటు వేసిన అనంతరం సీల్ చేసిన బ్యాలెట్ పత్రాన్ని అందజేస్తున్న వయోవృద్ధురాలు

సాక్షి,పాడేరు: ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్‌కు వృద్ధులు, దివ్యాంగులు, అంధుల నుంచి స్పందన లభిస్తోంది. జిల్లాలో 85 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులు అరకులోయ నియోజకవర్గంలో 624 మంది, పాడేరు నియోజకవర్గంలో 538 మంది, రంపచోడవరం నియోజకవర్గంలో 1561 మందిని, దివ్యాంగులు అరకులోయ నియోజకవర్గంలో 644 మంది, పాడేరు నియోజకవర్గంలో 697 మంది, రంపచోడవరం నియోజకవర్గంలో 554 మందిని హోం ఓటింగ్‌కు అధికారులు గుర్తించారు. ఇలా జిల్లావ్యాప్తంగా వృద్ధులు 2723, దివ్యాంగులు 1895 మందికి హోం ఓటింగ్ సౌకర్యం ఎన్నికల కమిషన్ కల్పించింది. వీరిలో అరకులోయలో 20 మంది, పాడేరులో 12 మంది, రంపచోడవరంలో 78 మంది శనివారం ఓటు హక్కు వినియోగించుకున్నట్టు జిల్లా ఎన్నికల అధికార వర్గాలు తెలిపాయి. ప్రతీ ఇంటి వద్ద అందరి సమక్షంలో పోలింగ్ బూత్ మాదిరిగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయడంతో రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ నోడల్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, ఏపీవో, డిప్యూటీ తహసీల్దార్, మైక్రో అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఓటింగ్ జరిగింది. అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు పాల్గొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది.

రంపచోడవరం: నియోజకవర్గం పరిధిలో 99 మందిని హోం ఓటింగ్‌కు గుర్తించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తిలో ఇద్దరు దివ్యాంగులు, వృద్ధురాలు, రాజవొమ్మంగిలో ముగ్గురు దివ్యాంగులు హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నట్టు మైక్రో అబ్జర్వర్ లోవరాజు తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారి రాజ్ దివాకర్, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. వీడియోగ్రాఫర్ చిత్రీకరించారు. వీరిలో లబ్బర్తికి చెందిన 89 ఏళ్ల వృద్ధురాలు పలకా సీతయ్యమ్మ ఓటుహక్కును వినియోగించుకుంది.

పెదబయలు: మండలంలో ఐదుగురు దివ్యాంగులు ఎన్నికల కమిషన్ కల్పించిన హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నట్టు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విగ్గిన్స్ తెలిపారు. మండలంలోని గోమంగి పంచాయతీ వన్నాడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొర్రా సంగు, గలగండ పంచాయతీ గసాబులో ఒకరు, సీతగుంట పంచాయతీలో ముగ్గురు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో ఎనిమిది మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారని మండల పోలింగ్ అధికారి కె.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం కించాయిపుట్టు, దొడిపుట్టు, సుజనకోట, పెదగూడ, బంగారుమెట్ట పంచాయతీల్లో నిర్వహించిన హోం ఓటింగ్‌లో 85 ఏళ్ల వయసు దాటిన ముగ్గురు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉన్న ఐదుగురు హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్టు ఆయన తెలిపారు.

మంచానికే పరిమితమైనా..



మంచంగిపుట్టు మండలం ధారాపల్లికి చెందిన ఈమె పేరు కిల్లో సువర్ణ. వయసు 70 ఏళ్లు. పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమైంది. ఎన్నికల కమిషన్ కల్పించిన హోమ్ ఓటింగ్‌లో ఓటుహక్కును వినియోగించుకుంది.



హోమ్ ఓటింగ్‌కు ఏర్పాటుచేసిన బ్యాలెట్ బాక్సు

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, పీవో సూరజ్‌గనోరే, డీఎఫ్‌వో నరేంధిరన్

రంపచోడవరం: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ కోరారు. శనివారం రంపచోడవరంలో ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, డీఎఫ్‌వో నరేంధిరన్‌తో కలిసి ప్రభుత్వ ఉద్యోగులతో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్‌సెంటర్ మీదుగా అటవీశాఖ చెక్‌పోస్టు వరకు సాగింది. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ గత ఎన్నికలలో రంపచోడవరంలోని 204, 206, 207 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం 65 శాతం కన్నా తక్కువ నమోదైందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, సీఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం

తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 683 మంది ఓటు హక్కు వినియోగం



ఓటును బాక్స్‌లో వేస్తున్న ఉద్యోగులు



రంపచోడవరంలో ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్వో ప్రశాంత్‌కుమార్



అరకులో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు



అరకులో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో అభిషేక్

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. దీనిలో భాగంగా స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో బ్యాలెట్ ప్రక్రియను జేసీ భావన వశిష్ఠ పర్యవేక్షించారు. తొలి రోజు 48 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 2,050మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు.

రంపచోడవరం: రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించి మొదటిరోజు 510 మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఉద్యోగులు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు ఓటుహక్కును వినియోగించుకోవచ్చునన్నారు. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం 4,658 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

అరకులోయ రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటిరోజు 125 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అభిషేక్ తెలిపారు. శనివారం స్థానిక కంఠభౌసుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ ప్రక్రియ ఏడవ తేదీ వరకు కొనసాగుతుందని ఆర్వో తెలిపారు.



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజనులు

సల్దిగెడ్డలో డయేరియా..13 మందికి అస్వస్థత

సాక్షి,పాడేరు: మండలంలోని మినుములూరు సచివాలయం పరిధిలోని మారుమూల సల్దిగెడ్డ గ్రామంలో డయేరియాతో 13 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఇటుకల పండగ సందర్భంగా శుక్రవారం మేకను కోసుకుని తిన్నారు. అదే రోజు రాత్రి నుంచి వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికావడంతో వారిని 108లో శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. యుద్ధప్రాతిపదికన వైద్య సేవలు అందిచడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం



ఆముదాలబంద గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఆముదాలబంద, దొరమామిడి, గొరగుమ్మి, పెదగార్లపాడు గ్రామా ల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జగనన్న ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించిందన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి సాధించేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. మండలంలో సంక్షేమ కార్యక్రమాల అమలులో రూ.135 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ బేబీ రత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామ తులసి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యజ్జు వెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ సిద్ధార్థ , అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శులు ఏడుకొండలు, బాబి, కన్వీనర్ శ్రీను, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు చక్రి, సర్పంచులు రాజమ్మ, రామలక్ష్మి, శివదొర, కామరాజు దొర, మాజీ సర్పంచ్‌లు పాయం వెంకటేశ్వర్లుదొర, పరదా వెంకటేశ్వర్లు దొర, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీ, వెంకటనగరం, మద్దిబందలు గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజవొమ్మంగి వచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీపీఎం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు విలేకరులకు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు చంద్రరాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిలో శనివారం ఎదురెదురుగా వస్తున్న ఆటో, మోటరు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరమడుగులు గ్రామానికి చెందిన ముత్యాల సూర్యప్రకాష్‌రెడ్డి(17), లోత లింగేశ్వరరెడ్డి(16)లు మోటారుబైక్‌పై శనివారం వై.రామవరం వచ్చి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో, బైక్‌లు ఢీ కొన్నాయి.. సంఘటనలో బైక్‌పై వెళ్తున్న వారిద్దరు తీవ్ర గాయాలు పాలయ్యారు. వారిద్దరిని అంబులెన్స్‌లో స్థానిక సీహెచ్‌సీకు తరలించారు. తీవ్రగాయాలు పాలైన వారిద్దరికి ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ రాహూల్ అధ్వర్యంలో వైద్యాధికారి జీవన్ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. స్థానిక ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ రుద్రశేఖర్ తదితరులు

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్) : మండలంలో ఇటీవల చెత్త ఏరుకునే ఇద్దరు వ్యక్తులు ఘర్షణకు దిగి వారిలో ఒకరిని హత్య చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు అరకు సీఐ సీహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెత్త ఏరుకునే క్రమంలో నగదుకు సంబంధించి వారి మధ్య గొడవ జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఎస్. కోట మండలం రాజీపేట గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు (40)ని రుద్ర సువార్ (30) కర్రతో తలపై బలంగా కొట్టడంతో శ్రీనివాసరావు మృతి చెందాడని తెలిపారు. నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఏఎస్‌ఐ పురంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

దేవీపట్నం: మండలంలోని ఫజుల్లాబాద్, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల్లో పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సీలేరు థర్మల్ ప్రాజెక్టు ఉద్యోగుల ప్రతిభ

మోతుగూడెం: రాష్ట్ర స్థాయి విద్యుత్ క్రీడ పోటీల్లో లోయర్ సీలేరు జట్టు అత్యున్నత ప్రతిభ కనబరిచింది. కడప జిల్లా రాయలసీమ థర్మల్ విద్యుత్ స్టేషన్‌లో మే ఒకటి నుంచి 3వ తేదీ వరకు అథ్లెటిక్స్, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 సర్కిల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో విజయవాడ థర్మల్ స్టేషన్ ప్రథమ స్థానం సాధించగా, లోయర్ సీలేరు జట్టు ద్వితీయ స్థానం సాధించింది. సాంస్కృతిక విభాగంలో లోయర్ సీలేరు జట్టు నుంచి బెస్ట్ యాక్టర్‌గా సతీష్ రాఘవన్, ఏకపాత్రాభినయంలో ప్రసాద్ అవార్డులు తీసుకున్నారు. అథ్లెటిక్ విభాగంలో లాంగ్ జంప్, రన్నింగ్, షటిల్, షాట్‌పుట్‌లో లోయర్ సీలేరు జట్టు ప్రథమ స్థానం సాధించింది. మహిళా విభాగంలో పూర్ణిమ ఉత్తమ ప్రతిభచాటారు. ఓవరాల్ ఛాంపియన్‌గా లోయర్ సీలేరు జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఉత్తమ క్రీడాకారులకు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, ఈఈ బాలకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



శిక్షణలో ట్రైనీ ఫారెస్టు అధికారులతో డీఎఫ్‌వో రాజు

సీలేరు: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని సబ్ డీఎఫ్‌వో ఎస్ఎస్‌బి రాజు చెప్పారు. ఏపీ ఫారెస్టు అకాడమి రాజమహేంద్రవరం నుంచి 30 మంది ట్రైనీ ఫారెస్టు అధికారులు స్టడీ టూర్‌లో భాగంగా శనివారం సీలేరు రేంజ్ పరిధిలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ ఎస్ఎస్‌బి రాజు వలసగెడ్డ టేకు తోటల్లో చెట్ల పెంపకం, సంరక్షణ గురించి తెలియజేశారు. అనంతరం దారకొండ సెక్షన్‌లో వర్తండపాడు వద్ద గల ప్లాంటేషన్‌లో మారుజాతి చెట్ల పెంపకం, విత్తనాల సేకరణ, అడవుల సంరక్షణ, అభివృద్ధి గురించి తెలియశారు. అడవులను సంరక్షణతో వాతావరణ సమతూల్యతను కాపాడవచ్చన్నారు. వేసవిలో విలువైన అటవీ సంపద అగ్ని ప్రమాదాలకు గురికాకుండా గ్రామస్తులు చూసుకోవాలని కోరారు. ఏపీ ఫారెస్టు అకాడమీ కోర్సు డైరెక్టర్ టి.శ్రీనివాసు, సబ్ డీఎఫ్ఓ రాజు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు , ఆర్వో సీహెచ్.సింహాచలం, ఎఫ్ఎస్‌వో కె.సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం భారీ రోడ్‌షో నిర్వహించారు. మండలంలోని దూసరపాము నుంచి రాజవొమ్మంగి వరకు సాగిన ర్యాలీలో గ్రామస్తులు ఆయన కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు అడ్డుకున్న విషయం ప్రజలంతా గమనిస్తున్నారని, ఎన్నికల్లో సరైన విధంగా బుద్ధి చెబుతారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో పేదల పాలిట వరం అని అభివర్ణించారు. వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకొని మరింత అభివృద్ధి, సంక్షేమం పొందుదామన్నారు. వైఎస్సార్‌సీపీ విజయ మే అందరి లక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజా రాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు రాజేశ్వరి, చంద్రరాణి, సర్పంచ్‌లు మురళీకృష్ణ, శుభలక్ష్మి, గణలక్ష్మి, నాగేశ్వరరావు, వెంకటేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణిని శాలువాతో సత్కరిస్తున్న మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

సాక్షి,పాడేరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు.వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణలు శనివారం బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థితనూజరాణి అత్యధిక మెజార్టీ సాధించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యామ్,మాజీ సర్పంచ్ నారాయణ,నాయకులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేట నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలెన్నింటినో జగనన్న ప్రభుత్వం పరిష్కరించి పేట ప్రజల మన్ననలు పొందింది.



కోటవురట్లలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

పేట.. ప్రగతి బాట

నక్కపల్లి : జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో గుర్తించిన సమస్యలు పరిష్కరించడంతో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ బడులు, ఆస్పత్రులు కొత్త భవనాలు, సదుపాయాలతో అభివృద్ధి చెందాయి. రహదారులు అద్దంలా మారాయి. ఇంటింటి కుళాయిల ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. రైతు భరోసా కేంద్రాలు, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు వంటి సదుపాయాలు రైతులకు సమకూరాయి. పలు ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి, సిబ్బందిని **నియమించడంతో ఆరోగ్య సేవలు మరింత మెరుగయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి నూతన విధానాలతో వైద్యాన్ని ప్రభుత్వం** ప్రజలకు చేరువ చేసింది.

ప్రభుత్వ బడులు 'నాడు-నేడు'


నాడు నేడు పథకం కింద పాఠశాల రూపురేఖలు మార్చివేసిన దృశ్యం

వ్యవ'సాయం'

1984 నుంచి 2009 వరకు పాతికసంవత్సరాల పాటు నియోజక వర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టినప్పటికీ ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. 2004లో మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేక నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన పాయకరావుపేట నియోజకవర్గ వాటాగా రావాల్సిన 35 క్యూసెక్కుల తాండవ జలాల విడుదలకు చర్యలు తీసుకున్నారు. సముద్రంలో వృధాగా కలిసిపోతున్న తాండవ జలాలకు అడ్డుకట్ట వేసి సాగుకు ఉపయోగించే విధంగా రూ. 8 కోట్లతో మినీ ఆనకట్టలు నిర్మించారు. ఫలితంగా భూమి, ముఠా, ఆవ, మంగవరం కాలువల దిగువన ఉన్న 15 వేల ఎకరాలకు ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతోంది. వరహానదిపై రూ.5 కోట్లతో గట్లు పటిష్టం చేశారు. నియోజవర్గానికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం వాటర్ గ్రిడ్‌కు రూ.35 కోట్లు మంజూరు చేశారు.

అన్నదాతలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) నిర్మించి వాటి ద్వారా రైతులకు అన్నిరకాల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేసే కార్యక్రమం చేపట్టారు. పాయకరావుపేటలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మించారు.

నాడునేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి రెండు విడతల్లో 211 పాఠశాలలకు రూ.92 కోట్లు కేటాయించారు. నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్, తాగునీరు, మినరల్‌వాటర్ ప్లాంట్లు, విద్యార్థుల కోసం డిజిటల్ క్లాసు రూములు, ప్రహరీగోడలు, క్రీడామైదానాలు,బెంచీలు, పాఠశాలలకు ఆకర్షణీయమైన రంగులు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

ఆస్పత్రులు.. ఆహా..

ప్రజలకు వైద్య సేవలు అందించే ఆస్పత్రులకు రూ.9 కోట్లు కేటాయించారు. నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిని 50 పడకల స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.3 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారు. పాయకరావుపేటలో రూ.1.70 కోట్లతో, ఎస్.రాయవరంలో రూ.1.30 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనాలు నిర్మించారు.

ప్రత్యేకంగా వార్డులు రోగుల కోసం పేయింగ్ రూములు తాగునీరు, వాడుకనీరు సదుపాయం కల్పించారు. కోటవురట్ల 30 పడకల ఆస్పత్రికి **మరో రూ.3 కోట్లు** కేటాయించి అదనపు భవనాలు **నిర్మించారు.** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో **భాగంగా ప్రతి** గ్రామంలోను వెల్‌నెస్ సెంటర్ **నిర్మించి, వైద్య** సిబ్బందిని నియమించి మెరుగైన **ప్రభుత్వ వైద్య** సేవలు అందిస్తున్నారు.



రూ.3కోట్లతో నక్కపల్లిలో అప్‌గ్రేడ్ చేసిన 50 పడకల ఆస్పత్రి

జగనన్న కాలనీలు.. ఆనందాల లోగిళ్లు


జగనన్నకాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు

ప్రతి పేదవాడికి సొంత గూడు ఉండాలన్న ఉద్దేశ్యంతో జగనన్న ప్రభుత్వం సంకల్పించింది. నియోజకవర్గంలో దాదాపు 9 వేల మందికి ఉచితంగా లక్షలాది రూపాయల విలువైన ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. ఒక్కొక్క లబ్దిదారునికి 72 గజాల స్థలం ఉచితంగా ఇవ్వడంతోపాటు, ఇంటి నిర్మాణానికి రూ.1.85లక్షలు ఆర్థిక సాయంగా అందజేసింది. జగనన్నకాలనీలుగా నామకరణం చేసుకుని లబ్దిదారులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లనిర్మాణాలు ప్రారంభించి గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారు.కాలనీల్లో విద్యుత్ సదుపాయం , తాగునీటి సదుపాయం రోడ్లు, కాలువలు నిర్మించారు. వాడుకనీటి సదుపాయం కూడ కల్పించారు. ఈ నాలుగున్నరేళ్లలో 11,280 మంది లబ్దిదారులకు రూ.77కోట్ల మేర చెల్లింపులుజరిపారు.

రహదారులు అద్దంలా...


పాయకరావుపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన మెయిన్‌రోడ్డు

ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.63.57 కోట్లతో 263 కిలోమీటర్ల కొత్త రోడ్లు నిర్మించడం, పాడయిన రోడ్లకు మరమ్మతులు చేయించడం వంటి పనులు చేశారు. అలాగే గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.16 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. ఇవి గాకుండా ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు, ఎంపీ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కూడా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయం మెరుగుపరిచారు. పాయకరావుపేట పట్టణంలో రూ.3 కోట్లతో నూతనంగా మెయిన్ రోడ్డు నిర్మించారు. గ్రామాలకు వెళ్లేందుకు లింక్ రోడ్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు చేపట్టారు.

నెరవేరిన కల...డిగ్రీ కళాశాల

2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీల్లో భాగంగా నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. నాడు నేడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు మార్చి మౌలిక సదుపాయలు, నూతన భవానాలు, బెంచీలు, విద్యార్థులకు ట్యాబులు, రెండు జతల యూనిఫాం , బ్యాగులు, పుస్తకాలు, షూస్ అందజేశారు.

ఇంటి ముంగిటకే జల్ ధారలు

నియోజకవర్గం మొత్తం మీద రూ.200 కోట్లతో జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని సరఫరా చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ నిధులతో మొత్తం 97 గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు నిర్మించారు. గ్రామాల్లో ప్రతి వీధికి పైపు లైను వేసి కుళాయి పాయింట్లు ఏర్పాటు చేసి ఇళ్ల వద్దకే తాగునీరు సరఫరా చేసే పనులు చేపట్టారు. దాదాపు 70 శాతం పనులు పూర్తియ్యాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా కూడా ప్రారంభించారు.



జల్‌జీవన్‌మిషన్ కింద ముకుందరాజుపేటలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం


పాయకరావుపేటలో నిర్మించిన సచివాలయంలో వివిధ సేవలను సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు

ప్రజల ముంగిటకే పాలన

సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచి తమ సమస్యలు పరిష్కారం, ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. అవ్వా తాతలకు పింఛను తీసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటికి తీసుకెళ్లి అందించే కార్యక్రమం చేపట్టారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా



నాలుగేళ్లలోనే నలభై ఏళ్ల అభివృద్ధి చేసి చూపించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. 2019 నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ.3వేల కోట్లు పైగా జమ చేయడం జరిగింది. నియోజకవర్గ చరిత్రలోనే లబ్దిదారులకు ఇంత మొత్తాన్ని ఆర్థిక సాయం రూపంలో దళారుల ప్రమేయం లేకుండా అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానిదే. ఈ పథకాలు, అభివృద్ధి నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోతాయి. నలభై ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల, 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడం జరిగింది. 2024 ఎన్నికల్లో ప్రజలను ఓటు అడిగే హక్కు మా పార్టీకే ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరిగింది.

– గొల్లబాబూరావు, రాజ్యసభ సభ్యుడు

కనీవినీ ఎరగని అభివృద్ధి



పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో కనివినీ అభివృద్ధి జరిగింది. డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల కింద సుమారు రూ.3వేల కోట్లు ఖర్చు చేయడం సాధారణ విషయం కాదు. ప్రజలకు అవసరమైన అన్ని అవసరాలు తీర్చడం జరిగింది. ఇంకా ఏమయినా పూర్తి చేయాల్సిన పనులు ఉంటే ఈ మూడు నెలల కాలంలో పూర్తి చేయడం జరుగుతుంది. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే అభ్యర్థి

చరిత్రలో నిలిచిపోయేలా...

డీబీటీ కింద నియోజకవర్గంలో 2019 నుంచి 2023 వరకు జగనన్న ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం వివరాలు పరిశీలిస్తే...

పథకం పేరు	లబ్ధిదారులు సంఖ్య	మొత్తం (రూ. కోట్లలో)
రైతు భరోసా	41,071	24.30
అమ్మఒడి	1,34,514	161.75
వైఎస్సార్ చేయూత	15,882	803
వైఎస్సార్ ఆసరా	67,093	1600
పింఛన్లు	47,881	127.72
కాపునేస్తం	31,138	46.70
వాహనమిత్ర	8867	8.87
ఆరోగ్యశ్రీ	24,555	50.37
గృహనిర్మాణం	11,820	78
సున్నావడ్డీ	78,694	24.75
జగనన్న తోడు	5545	5.54
నాడు-నేడు పాఠశాలల సంఖ్య	211	56.27

ఇవికాకుండా రూ.27 కోట్లతో 68 సచివాలయాలు, రూ.12 కోట్లతో 56 రైతు భరోసా కేంద్రాలు, రూ.11 కోట్లతో 48 వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారు. పాయకరావుపేటలో రూ.82 లక్షలతో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ నిర్మించారు.

టీడీపీ హయాం... హామీలతో సరి!

నక్కపల్లి : టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్యకాలంలో హామీలే తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదు.

- అప్పట్లో ఎన్నికల ముందు ప్రచారంలో ఈ ప్రాంతానికి వచ్చిన చంద్రబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితలు నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, ఏరియా ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచుతామని, పాయకరావుపేట మెయిన్‌రోడ్డును విస్తరిస్తామని, పీహెచ్‌సీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన చినదొడ్డిగల్లులో పీహెచ్‌సీని పూర్తి చేస్తామని, హామీలు గుప్పించారు. ఆచరణలో ఎటువంటి పురోగతి లేదు.
- తాండవకు అనుబంధంగా ఉన్న ఆవ, భూమి, ముఠా కాలువలను ఆధునీకీకరిస్తామని హామీ ఇచ్చారు. రేవు పోలవరాన్ని పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తామన్నారు.
- ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేస్తామంటూ అప్పటి పంచాయతీరాజ్‌శాఖామంత్రి లోకేష్ చేత కొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ఆచరణలో ఇది కూడా అసంపూర్తిగా వదిలేశారు.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ నిధులతో గ్రామాల్లో అక్కడక్కడ వీధి రోడ్లు, కాలువలు తప్ప టీడీపీ హయాంలో చెప్పుకోదగ్గ ప్రధాన అభివృద్ధి పని అంటూ ఏమీ జరగలేదు.
- టీడీపీ నాయకులు ఇచ్చిన డిగ్రీ కళాశాల, నక్కపల్లి, కోటవురట్ల 30 పడకల నుంచి 50 పడకలకు వరకు ఆస్పత్రి అప్‌గ్రేడ్, నూతన భవనాలు నిర్మాణం, మెయిన్‌రోడ్డు విస్తరణ, పాయకరావుపేట, ఎస్.రాయవరంలలో కొత్త పీహెచ్‌సీలు నిర్మాణం వంటి హామీలన్నీ ఆ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గత ఐదేళ్లలో ఆయా అభివృద్ధి పనులు నెరవేర్చారు.

? మీకు తెలుసా

మన ఓటు మనం చూడొచ్చు

ఏడు సెకన్ల వరకే అవకాశం



యలమంచిలి రూరల్ : ఎన్నికల సంఘం పారదర్శకతకు పెద్దపీట వేసి జవాబుదారీగా నిలవాలని నిర్ణయించింది. ఈవీఎంలకు ముందు ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ వాడితే ఓటరు తాను ఎవరికి ఓటు వేశాడో స్పష్టంగా తెలిసేది. ఈవీఎంలు వచ్చాక ఆ వెసులుబాటు పోయింది. అనంతర కాలంలో ఓటరు తాను వేసిన ఓటు సంబంధిత వ్యక్తికే పడిందా లేదా తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. ఓటరు ఓటు వేయగానే వీవీప్యాట్‌లో చూసుకోవాలి. ఇది అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు, గుర్తును ముద్రిస్తుంది. ఆ పేపరు ఏడు సెకన్లు మాత్రమే కనిపిస్తుంది. తర్వాత దానంతటదే వీవీప్యాట్‌లోని బాక్సులో పడిపోతుంది. దీన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలండ్‌లో గల నోక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. తదుపరి అదే ఏడాది మిజోరాం అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాల్లో వినియోగించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 8 లోక్‌సభ స్థానాల్లో, 2017 గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో వినియోగించారు. ఈ యంత్రాలను సీల్ చేసే పేపర్, స్ట్రిప్ సీల్ తదితరాలను నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ మాత్రమే తయారు చేస్తుంది.

పల్లవించిన రాజకీయ చైతన్యం

గాంధీ నడిచిన నేల.. తీపిని పంచిన పల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక కొలువైన ప్రాంతం

బౌద్ధం పరిఢవిల్లిన బొజ్జన్న కొండ


ఇక్కడి నుంచి గెలిస్తే మంత్రి పదవి ఖాయమని సెంటిమెంట్

చక్కని పల్లె వాతావరణం... చుట్టూ పచ్చని పొలాలు.. పక్కనే గలగలా పారే శారదా నది.. చెంతనే అమ్మా.. అని పిలిస్తే కాచికాపాడే నూకాంబిక ... గత వైభవ బౌద్ధమత దీప్తులకు గురుతుగా అలరారుతున్న బొజ్జన్న కొండ...ఇవన్నీ కలిస్తే అందమైన పట్టణ పోకడలున్న అనకాపల్లి నియోజకవర్గం. క్రీస్తుశకం 9వ శతాబ్దంలో అనగాపల్లిగా పేరుపొందిన ఈ ప్రాంతం రానురాను అనకాపల్లిగా మారింది. అనకాపల్లి నుంచి సీపీఐ నేత దివంగత కొడిగంటి గోవిందరావు, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు దివంగత వి.వి.రమణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంతో ఈ ప్రాంతం మార్మోగింది. ఆ సమయంలో జాతిపిత మహాత్మాగాంధీ అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు, బెల్లంమార్కెట్‌కు వచ్చారు. బ్రిటిష్ కాలంలో 1830వ సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, న్యాయస్థానం ఉండేవి. ఈ ప్రాంతవాసులు రాజకీయంగా ఎంతో చైతన్యవంతులు.


– అనకాపల్లి

అనకాపల్లి

నియోజకవర్గంలో ఓటర్లు	:	2,13,714
పురుషులు	:	1,03,088
మహిళలు	:	1,10,621
ఇతరులు	:	5
పోలింగ్ బూత్‌లు	:	251




నూకాంబిక అమ్మవారు


బొజ్జన్న కొండ

నియోజకవర్గ స్వరూపం

అనకాపల్లి నియోజక వర్గంలో అనకాపల్లి పట్టణం, మండలం, కశింకోట మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి సరిహద్దుల్లో యలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక, రాంబిల్లి మండలాలు, పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాలు, మాడుగుల నియోజకవర్గంలోని కోటపాడు, చోడవరం నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, పాయకరావుపేట నియోజకవర్గంలో కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలున్నాయి. అనకాపల్లి పట్టణంలో ఐదు వార్డులు జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి.


అనకాపల్లి బెల్లం మార్కెట్

నియోజకవర్గం ప్రత్యేకతలు

- 1945వ సంవత్సరంలో అనకాపల్లి కేంద్రంగా బెల్లం మార్కెట్ ఏర్పడింది. దేశంలోనే రెండోవస్థానం పొందిన మార్కెట్‌గా ప్రసిద్ధిచెందింది.
- 1942వ సంవత్సరంలో శారదా గ్రంథాలయం, 1943లో గౌరీగ్రంథాలయం స్థాపించారు
- అనకాపల్లి మండలంలో పర్యాట ప్రాంతంగా, బౌద్ధారామంగా గుర్తింపు పొందిన బొజ్జన్నకొండ సుమారుగా 2వేల సంవత్సరాల క్రితం ఏర్పడింది. ప్రతి ఏడాది వేలాదిమంది టూరిస్టులు ఈ కొండను సందర్శిస్తారు.
- అనకాపల్లి మండలంలోనే తొలి సహకార పరిశ్రమ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు అయింది.
- అనకాపల్లి కేంద్రంగా ఏఎంఏఎల్ కళాశాలను వర్తకసంఘం ఆధ్వర్యంలో 1945వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇచ్ఛాపురం నుంచి తుని వరకూ లక్షలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకున్నారు.
- ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన నూకాంబిక అమ్మవారి దేవాలయంలో అనకాపల్లి పట్టణంలో ఉంది. ఏటా దేశవిదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.
- కశింకోట మండలంలో 1972వ సంవత్సరంలో ఆర్‌ఈసీఎస్ సంస్థను ఏర్పాటు చేశారు.
- కశింకోట మండల పరిధిలో పలు సిమెంట్ ప్యాక్టరీలు ఉన్నాయి.


మలసాల భరత్‌కుమార్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి


కొణతాల రామకృష్ణ జనసేన అభ్యర్థి

2024 ఎన్నికల ముఖ చిత్రం

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, జనసేన అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున మలసాల భరత్‌కుమార్ పోటీ చేస్తుండగా, జనసేన తరఫున కొణతాల రామకృష్ణ బరిలో ఉన్నారు. ఈయన చాలా కాలం నుంచి నియోజకవర్గానికి దూరంగా ఉండి, తిరిగి ఎన్నికలకు కొద్దికాలం ముందు అభ్యర్థిగా తెర మీదకు వచ్చారు. పెద్దగా ప్రజల్లో తిరిగిన దాఖలాలు లేవు. మరోవైపు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమరనాథ్ సుమారు ఎనిమిది వేల ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడమే దీనికి నిదర్శనం. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలతో అన్నివర్గాల వారు వైఎస్సార్‌సీపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీవైపే మొగ్గు కనిపిస్తోంది.

రాజకీయ పోరు

ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో అనకాపల్లికి ఆనుకుని ఉన్న పరవాడ మండలంలోని పలు గ్రామాలను అనకాపల్లి మండలంలో కలిపారు. మునగపాక మండలంలోని కొన్ని గ్రామాలు అనకాపల్లి నియోజకవర్గంలో ఉండేవి. పునర్విభజన తరువాత వాటిని యలమంచిలి నియోజవర్గంలో కలిపారు.ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిగెలిచిన వారికి మంత్రి వర్గంలో బెర్త్ ఖాయమవుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. ఆదేవిధంగా ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉంటారనే సెంటిమెంట్ కూడా ఉంటుంది.

సంవత్సరాల వారీగా విజయం సాధించిన వారి వివరాలు

1952	కె.గోవిందరావు(సీపీఐ)
1955	భీశెట్టి అప్పారావు(కృషికార్ లోక్‌పార్టీ)
1962	కె.గోవిందరావు(సీపీఐ)
1967	కె.గోవిందరావు(సీపీఐ)
1972	పి.వి.రమణ(కాంగ్రెస్)
1978	కె.గోవిందరావు(సీపీఐ)
1983	రాజా కన్నబాబు(టీడీపీ)
1985	దాడి వీరభద్రరావు(టీడీపీ)
1989	దాడి వీరభద్రరావు(టీ డీపీ)
1994	దాడి వీరభద్రరావు(టీడీపీ)
1999	దాడి వీరభద్రరావు(టీడీపీ)
2004	కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)
2009	గంటా శ్రీనివాసరావు (ప్రజా రాజ్యం)
2014	పీలా గోవింద సత్యనారాయణ(టీడీపీ)
2019	గుడివాడ అమర్‌నాథ్(వైఎస్సార్‌సీపీ)